క్లుప్తంగా

ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

చంపాపేట:కర్మన్‌ఘాట్ క్రాంతి క్లబ్ ఆవరణలో ఆదివారం విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విశ్వకర్మ భగవాన్ ప్రతిమకు పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్వామివారి ఊరేగింపు రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు రవీందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ మహా యజ్ఞం



పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ మహాయజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. గౌతంనగర్‌లోని విశ్వకర్మవీధిలో ఏర్పాటు చేసిన యజ్ఞానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఉప్పల్ భగాయత్ వరకు విశ్వకర్మలు ర్యాలీ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రవిచారి, యజ్ఞకమిటీ ప్రధాన కార్యదర్శి నారాయణదాస్, ప్రవీణ్‌చారి, కోశాధికారి రవి, లవకుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర చిరస్మరణీయం

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ)ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన తెలంగాణ తొలి అమరవీరుడు శ్రీకాంత్ చారిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు సత్యం, రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సెల్వాచారి, ఎల్బీనగర్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పర్వతం శ్రీనివాసా చారి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నాగోలు: నల్గొండ జిల్లా సూర్యాపేట ఆదర్శ హైస్కూల్ పదో తరగతి (1994 బ్యాచ్) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నాగోలులోని స్వాగత్ హోటల్ ఘనంగా నిర్వహించారు. 29 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వీరు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపి రోజులను గుర్తు చేసుకొని ఉద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీఓగా పదోన్నతి పొందిన తమ బ్యాచ్ విద్యార్థిని కర్ర అనితారెడ్డిని స్నేహితులంతా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

ఆత్మరక్షణ విద్యలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం

హస్తినాపురం: కరాటే, తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యల వల్ల మనిషిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, వీటిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సామనగర్‌లోని వెల్‌బిల్ట్ తైక్వాండో అకాడమీ కోచ్ సిద్ధార్థయాదవ్, అంకంరాజు ఆధ్వర్యంలో తైక్వాండో నేర్చుకుంటున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జలేంధర్‌రెడ్డి విచ్చేసి విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల తైక్వాండో జనరల్ సెక్రటరీ డి.సుధీర్, న్యాయవాది రమణారావు తదితరులు హాజరయ్యారు.

షోయబుల్లా ఖాన్ స్టాంప్ ఆవిష్కరణ స్ఫూర్తిదాయకం



సైదాబాద్: నిజాం పాలనకు వ్యతిరేకంగా రచనలు చేసి ప్రజల్లో చైతన్యం కలిగించిన షోయబుల్లా ఖాన్ స్మారక స్టాంపులు ఆవిష్కరించడం ఎంతో స్ఫూర్తిదాయకమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో షోయబుల్లాఖాన్ స్టాంపులను విడుదల చేశారు. చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ విద్యాసాగర్‌రెడ్డి నుంచి సురేందర్‌రెడ్డి స్టాంపులను అందుకున్నారు.

రక్తదానం మహాదానం

లింగోజిగూడ: రక్తదానం మహాదానమని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే ఈ రక్తాన్ని ఉత్పత్తి చేసే శక్తి సామర్థ్యాలు కేవలం మన దేహానికి మాత్రమే ఉందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆరోగ్యవంతులంతా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆదివారం లింగోజిగూడ డివిజన్‌లోని భాగ్యనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గణపయ్యా.. పూజలందుకో రావయ్యా!



హయత్‌నగర్‌లో విగ్రహాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న భక్తులు



పూలు, విగ్రహాలను కొనుగోలు చేస్తున్న భక్తులు



- అంతటా వినాయక చవితి సందడి
- జైబోలో గణేశ్ మహరాజ్‌కీ నినాదాలతో మార్మోగుతున్న రహదారులు
- గణపతి ప్రతిమలు, పూజాసామగ్రి కొనుగోలుదార్లతో మార్కెట్ల సందడి

దిల్‌సుఖ్‌నగర్/హయత్‌నగర్: గణపతి బప్పా మోరియా...జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై.. అంటూ యువకులు, పిల్లల నినాదాలతో రహదారులు, గణపతి విగ్రహాల విక్రయ ప్రాంతాలు, మండపాల పరిసర ప్రాంతాలు మార్మోగుతున్నాయి. ఎక్కడ చూసినా వినాయక నవరాత్రుల సందడే కనిపిస్తోంది. వినాయక చవితిని ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

- సోమవారం నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభ మవుతుండటంతో మలక్‌పేట జోన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, మలక్‌పేట, అక్బర్‌బాగ్, సైదాబాద్, మూసారంబాగ్, మాదన్నపేట, ఐఎస్‌సదన్, ఓల్డ్‌మలక్‌పేట, సరూర్‌నగర్, తదితర ప్రాంతాలలో పండుగ సందడి నెలకొంది.
- రైతుబజార్లతో పాటు ప్రధాన రహదారుల పక్కన, ప్రధాన చౌరస్తాల్లో వినాయక ప్రతిమలు, పూజకు ఉపయోగించే పత్రి, పండ్లు, పూల విక్రయ దుకాణాలను ప్రత్యేకం ఏర్పాటు చేశారు. ఈ షాపుల వద్ద ఆదివారం కొనుగోలుదార్లు బారులు తీరారు.
- పూజాపత్రి, పూలు, పండ్లు, గణపతి విగ్రహాల ధరలు ఈసారి రెండింతలు పెరిగాయిని భక్తులు తెలిపారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

ఎల్బీనగర్,మలక్‌పేట జోన్ల బృందం: పర్యావరణ పరిరక్షణకు, నీటి కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించుకోవాలని ఎమ్మెల్సీ బొగ్గరపు దయనంద్‌గుప్తా, పలువురు కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

- హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంకాల శేఖర్‌రెడ్డి, ప్రతినిధులు అమర్‌నాథ్‌యాదవ్ పంపిణీ చేశారు.సేవ్ఎర్త్ ఫౌండేషన్ టి.సురేందర్, యోగాగురువు విజయ్ ప్రతాప్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఐఎస్‌సదన్ చౌరస్తాలో... మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి



కొత్తపేటలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ బొగ్గరపు దయనంద్‌గుప్తా



హయత్‌నగర్ శారదానగర్‌లో.. కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో... కాలనీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

హస్తినాపురం: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం రంగారెడ్డి అర్బన్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో హస్తినాపురంలో వైభవంగా నిర్వహించారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లాపరిషత్ రోడ్డులోని వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులతో కేక్ కట్‌చేయించి వారికి శాలువలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎరుకల మల్లేశ్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, మాధవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రాజుగౌడ్, శ్రీధర్, శేఖర్‌గౌడ్, మునిల్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరిస్తున్న సామ రంగారెడ్డి

కాంగ్రెస్‌దే అధికారం: దేప

దిల్‌సుఖ్‌నగర్: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలో వచ్చిందే కాంగ్రెస్ పార్టీయేనని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం విజయభేరి సభకు మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్‌కేపురం నుంచి వెళ్తున్న వాహనాలకు సభ కోఆర్డినేటర్ నల్ల సుధాకర్ రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో

మలక్‌పేట: తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభకు ఆదివారం మలక్‌పేట నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నాయకులు యాదిలాల్, భాస్కర్, మధు, మహేష్, నాగరాజు, కృష్ణ, సాయిరామ్, శివ, మనీష్, అనిరుధ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైదాబాద్: కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభకు సైదాబాద్ నుంచి చక్రపాణి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లారు. సభకు గంట్ల కృష్ణ, బాలకృష్ణ, అర్షద్, రామారావు, రామ్మూర్తి, కావేటి రవి తదితరులు పాల్గొన్నారు.



భాస్కర్‌రెడ్డి నాయకత్వంలో విజయభేరి సభకు వెళ్తున్న నాయకులు



మలకపేట నుంచి చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో...

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

నాగోలు: వినాయక చవితి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో కొత్తపేట డివిజన్‌లోని భరత్ నగర్ ఫేజ్- 1లో డ్రైనేజీ నీరు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. భరత్‌నగర్‌లో డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతూ వినాయక మండపాలకు వద్దకు వస్తుండటంతో చాలా ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. వెంటనే జలమండలి డీజీఎంకు ఫోన్ చేసి వాటర్ వర్క్స్ సిబ్బందిని పంపించి డ్రైనేజీ నీరు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేటర్ వెంట కాలనీ సెక్రటరీ వెంకటేష్, బాలు, బిక్షం, సంబయ్య, శేఖర్, నవీన్, సాయి తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

హస్తినాపురం: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేస్తోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డుల పంపిణీ కాంపును కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్యశ్రీలో రూ.2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచిన సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. రాజుగౌడ్, శ్రీశైలం, యాదయ్య, సతీష్, జనార్ధన్, పాండు, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

సందడిగా ప్రగతి డిగ్రీ కాలేజీ స్నాతకోత్సవం

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ ప్రగతి డిగ్రీ కాలేజీ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్.రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, సీతారాంరెడ్డి, చిన్నారెడ్డి హాజరై డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఎంచుకున్న రంగాలలో ప్రవీణ్యం సంపాదించి పది మందికి సహాయపడే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆట, పాటలతో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ మంజురెడ్డి, లెక్చరర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సమైక్యతా దినోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లేఔట్‌లో జాతీయ జెండాను డివిజన్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆవిష్కరించారు. నాయకులు సిద్దగోని వెంకటేష్ గౌడ్, శేఖర్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, వంగూరి యాదవ రెడ్డి, లింగస్వామి గౌడ్, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు

సైదాబాద్: సైదాబాద్ ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగువేశారు.



ఆర్‌కేపురంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న పెండ్యాల నగేష్

ఘనంగా విమోచన దినోత్సవం



ఎల్‌బీనగర్ పార్టీ కార్యాలయంలో జెండాకు వందన చేస్తున్న రంగారెడ్డి



చంపాపేటలో ... కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి



మన్సురాబాద్‌లో... కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

నాగోలు: ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో బీజేపీ నాయకులు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణ మాత్రం నిజాం నిరంకుశ పాలనలో కొనసాగేదన్నారు. నాటి కేంద్ర హోంశాఖ మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందన్నారు. దీనికి గుర్తుగా ప్రతి సంవత్సరం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు.



ఆర్‌కేపురం బీజేపీ కార్యాలయం వద్ద.. ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి



సరూర్‌నగర్‌లో.. పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, సందడి సురేందర్‌రెడ్డి



సైదాబాద్ కల్యాణ్‌నగర్‌లో... లింగాల హరిగౌడ్